సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 20 । జూన్ । 2025



అసైన్డ్.. అన్యాక్రాంతం
కేఎంసీ పరిధిలో కొందరు అసైన్డ్ భూములను దక్కించుకుని నిర్మాణాలు చేపట్టగా విజిలెన్స్ అధికారులు విచారణ మొదలుపెట్టారు. 10లో



మంత్రి పదవులు ఇవ్వకుంటే...
మంత్రి వర్గంలో స్థానం కల్పించకపోతే కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతామని యాదవ, మున్నూరుకాపు, ఎంబీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
35° / 26°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

నైరుతి.. కరుణ ఏదీ?

- మొదట్లో కురిసిన వర్షాలతో దుక్కులు దున్నిన రైతులు
- ఆ తర్వాత వరుణుడి జాడ లేక ఊపందుకోని పత్తి సాగు
- పొడి దుక్కుల్లో విత్తిన అన్నదాతల్లో ఆందోళన
- ఇంకొన్ని రోజులు వాన రాకపోతే కష్టమేనని ఆవేదన



తిరుమలాయపాలెం మండలం ఎదుళ్ల చెరువులో పత్తి విత్తనాలు నాటిన భూమి (ఇన్‌సెట్) వర్షాభావంతో గిడసబారిన మొక్క

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ముందస్తుగా వర్షాలు కురిశాయన్న ఆనందం రైతులకు కొద్దిరోజులు కూడా మిగల్లేదు. వ్యవసాయ పనులు ప్రారంభించే సమయానికి నైరుతి రుతుపవనాలు ముఖం చాటేయగా.. వరుణుడి కరుణ కోసం ఆకాశం వైపు ఎదురుచూడడం ఆనవాయితీగా మారింది. గత నెలాఖరులో జిల్లా అంతటా వర్షాలు కురవగా, రైతులు సంతోషంగా దుక్కులు దున్ని సేద్యానికి సిద్ధమయ్యారు. కొన్నిచోట్ల పత్తి విత్తనాలు కూడా నాటినా, ఆతర్వాత అనుకున్న స్థాయిలో వర్షాలు లేక అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. ఈపాటికే దాదాపు లక్ష ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటాల్సి ఉండగా, ఇది 30,351 ఎకరాలకే పరిమితమైంది. ఇక వరితో పాటు మెట్ట పంటల సాగు కూడా ఆశాజనకంగా నమోదు కాలేదు.

మే చివరిలోనే వర్షాలు..

ఈ ఏడాది మే మూడో వారంలోనే నైరుతి రుతుపవనాల ప్రవేశం, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వర్షాలు కురిశాయి. ఈ వర్షాల ఆధారంగా రైతులు దుక్కులు దున్నగా.. చాలామంది పత్తి విత్తనాలు విత్తారు. మృగశిర కార్తె ప్రారంభం తర్వాత వర్షాలు జోరందుకోవాల్సి ఉండగా, అడపా దడపా మబ్బులు కమ్మడం తప్ప వర్షం జాడే లేదు. ఇదే పరిస్థితి మరిన్ని రోజులు ఉంటే పత్తి విత్తనాలు భూమిలోనే కలిసిపోయే అవకాశముందనే భయంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు.

అంచనా అందుకునేనా..

గత నెలలోనే వర్షాలు కురిసిన నేపథ్యాన ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. గత వానాకాలంలో 2లక్షల ఎకరాల్లో పత్తి సాగవగా, ఈసారి 2,20,550 ఎకరాలకు చేరుతుందని భావించారు. ఈమేరకు కొందరు రైతులు విత్తనాలు నాటగా, మరికొందరు సరిపడా వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. అయితే, వర్షాలు ఆలస్యమవుతుండగా.. అంచనాల మేరకు జిల్లాలో పత్తి సాగవుతుందా, లేదా అన్న మీమాంస నెలకొంది.

వర్షాలు లేక.. మొలక రాక



ఈ ఫొటోలోని రైతు తిరుమలాయపాలెం మండలంలోని ఎదుళ్లచెరువుకు చెందిన నాగండ్ల మోహన్‌రావు. పది రోజుల క్రితం నాలుగెకరాల్లో పత్తి విత్తనాలు నాటాడు. అప్పటి నుంచి చిరుజల్లులు తప్ప మొలకలు వచ్చే స్థాయిలో వర్షం కురవడం లేదు. పత్తి విత్తనాలు నాటడానికి ఎకరాకు కూలీల ఖర్చుతో కలిపి రూ.5 వేలకు పైగా వెచ్చించాడు. విత్తనాలు మొలకెత్తే పరిస్థితి లేక, మరోమారు నాటాలంటే ఆర్థిక భారం తప్పదని ఆందోళన చెందుతున్నాడు.

మరో రెండు నెలలే..

ఈ వానాకాలం సీజన్ పంటల సాగుకు రెండు నెలల సమయమే ఉంది. ఆగస్టు వరకు వరి నాట్లు వేయడానికి అవకాశముంది. సన్న ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండడంతో రైతులు పంట సాగుపై దృష్టి పెట్టారు. కానీ పూర్తిస్థాయిలో వర్షాలు లేక వరి సాగు ఊపందుకోలేదు. ఈ సీజన్‌లో 2.85లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా వేయగా, ఇప్పటివరకు 9,740 ఎకరాలకు సంబంధించి నార్లు పోశారు. మరో 6,585 ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో సాగు మొదలుపెట్టారు. మొక్కజొన్న కూడా కేవలం 32ఎకరాల్లో సాగవుతోంది. ఈ సమయాన వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే ఇప్పటికే సాగైన పంటలకు ఊపిరి అందడమే కాక అంచనా మేర సాగు జోరందుకోనుంది.

బోర్లు, బావులే దిక్కు..

ఇప్పటివరకు మోస్తరు వర్షం తప్ప.. పంటలకు సరిపడా కురవలేదు. దీంతో పంటల సాగు అంతంతమాత్రంగానే ఉంది. ఓవైపు వరి నార్లు పోయగా, పత్తి విత్తనాలు విత్తారు. ఈ నేపథ్యాన పత్తి మొలకలను కాపాడుకునేందుకు రైతులు అవస్థ పడుతున్నారు. వర్షం కురవక బోర్లు, బావులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొనడంతో రైతులు ఆ దిశగా దృష్టి సారిస్తున్నారు.

ఆదిలోనే ఎదురుతిరిగింది..



రోహిణకార్తెలోనే వాన కురవడంతో పత్తి సాగుపై ఆశతో ఎనిమిది ఎకరాల్లో విత్తనాలు వేశాం. కొంత మేర మొలక వచ్చినా మొక్క ఎదగడం లేదు. ఇదిలాగే ఉంటే పెట్టుబడి మొత్తం మట్టి పాలైనట్లే. నాతో సహా చాలా మంది నష్టం చవిచూడాల్సి వస్తుంది.

– చెరుకూరి కృష్ణారావు, రేగులచలక

సాగు కష్టమే...



ఏటా మాదిరే ప్రకృతి మోసం చేసింది. పంట కాలం కంటే ముందే వాన పడడంతో పత్తి విత్తనాలు నాటాం. తీరా నాటాక వానల జాడ లేక పైకి వచ్చిన మొక్కలు, భూమిలో విత్తనాలు దెబ్బతిన్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే మళ్లీ విత్తనాలు కొనాలంటే కష్టమే.

– తోట వెంకట్, కోయచలక

వ్యవసాయ భూములన్నింటికీ 'భరోసా'

- ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తున్నాం..
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నర్సింహులగూడెంలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ అనుదీప్ తదితరులు

కూసుమంచి: వానాకాలం సీజన్ ఆరంభంలో రైతులు పెట్టుబడికి ఇబ్బంది పడకుండా రైతు భరోసా ద్వారా ఎకరాకు రూ.6వేలు జమ చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అన్నదాతలు విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలోనే పెట్టుబడి సాయం అందించడం ద్వారా వారి ఇక్కట్లు తీరనున్నాయని చెప్పారు. కూసుమంచి మండలం నర్సింహులగూడెం, పోచారం, పూర్యాతండా, చింతలతండా తదితర గ్రామాల్లో బీటీ, సీసీ రహదారుల నిర్మాణానికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి మంత్రి గురువారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గత నాలుగు రోజులుగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నగదు జమ అవుతోందని తెలిపారు. సాగు యోగ్యమైన ప్రతీ ఎకరా భూమికి భరోసా అందుతుందని స్పష్టం చేశారు. అంతేకాక ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తున్నామని మంత్రి తెలిపారు. ఈక్రమంలో ఎదురవుతున్న ఆర్థిక ఇక్కట్లను అధిగమిస్తూ అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు. కాగా, కూసుమంచిలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యాన నిర్వహించిన పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి కేక్ కట్ చేసి మాట్లాడారు. దేశ ప్రజల తరఫున ప్రశ్నించే ఏకైక గొంతుక రాహుల్‌గాంధీదేనని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఇందిరమ్మ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మంరూరల్: ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. ఏదులాపురంలో గురువారం పర్యటించిన ఆయన ఇళ్ల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణానికి ఏమైనా సమస్యలు ఉన్నాయా, తొలిదఫా బిల్లులు అందాయా అని ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణం చేపడుతుంటే ఎప్పటికప్పుడు బిల్లులు జమ అవుతాయని తెలిపారు. కాగా, కూపన్ల ద్వారా ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సును పరిశీలించి పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆతర్వాత ఏదులాపురం చెరువు కబ్జాపై ఫిర్యాదులు అందుతున్నందున సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డికి సూచించారు. అనంతరం ఏదులాపురం చెరువు, మిషన్ భగీరథ ఇన్ టేక్‌వెల్, పంప్ హౌస్‌ను కూడా కలెక్టర్ అనుదీప్ పరిశీలించారు.

పల్లె దవాఖానాలో మెరుగైన వైద్యం

పల్లె దవాఖానా ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. ఏదులాపురంలోని పల్లె దవాఖానా, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీయడమే కాక బీపీ చెక్ చేయించుకున్నారు. ఏఎన్ఎం సెలవులో ఉన్నట్లు తెలుసుకున్న ఆయన డీఎంహెచ్‌ఓను ఫోన్‌లో ఆరాతీశారు. ఆతర్వాత అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ పిల్లల హాజరు, సిబ్బంది వివరాలను పరిశీలించి పిల్లలతో మాట్లాడారు. తహసీల్దార్ పి.రాంప్రసాద్ వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

'రైతు భరోసా' పటిష్టంగా అమలు చేయాలి

ఖమ్మంవ్యవసాయం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు భరోసా పథకం ద్వారా అర్హులైన రైతులందరికీ లబ్ధి జరిగేలా వ్యవసాయ శాఖ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు సూచించారు. హైదరా బాద్ నుంచి గురువారం వీసీ ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ నిర్దేశిత సమయానికి పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన వారికి కూడా రైతు భరోసా వర్తించేలా పర్యవేక్షించాలని తెలిపారు. అలాగే, రైతు బీమాలో కూడా అర్హులైన రైతులను చేర్చేలా ఏఈఓలు కృషి చేయాలని, ఎరువుల డీలర్లు ఈ-పాస్ మిషన్ల ద్వారా విక్రయించేలా సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం ఫార్మర్ ఐడీ నమోదు, పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం అమలు, మట్టి నమూనాల సేకరణపై సూచనలు చేశారు. ఆతర్వాత రాష్ట్ర వ్యవసా య శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి మాట్లాడగా జిల్లా నుంచి డీఏఓ ధనసరి పుల్లయ్య, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వీ.మధుసూదన్, జిల్లా సహకార అధికారి జి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదెకరాల వరకు పెట్టుబడి సాయం జమ

రైతు భరోసా పథకం ద్వారా జిల్లాలో ఐదెకరాల వరకు భూమి కలిగిన రైతుల ఖాతాల్లో గురువారం పెట్టుబడి సాయం జమ అయింది. ఈమేరకు 18,769మంది రైతుల ఖాతాల్లో రూ. 50,63,75,056 జమ అయ్యాయని డీఏఓ పుల్లయ్య తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 3,06,920 మంది రైతుల ఖాతాల్లో రూ. 301,31,64,598ను ప్రభుత్వం జమ చేసిందని వెల్లడించారు.

సుమనోహరం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం సుమనోహరంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రామయ్యకు రూ.5 లక్షల విలువైన బంగారు హారం

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన ఎం.కృష్ణచైతన్య – రాజ్యలక్ష్మి దంపతులు గురువారం బంగారు హారం అందజేశారు. సుమారు రూ.5 లక్షల వ్యయంతో తయారు చేయించిన 52.25 గ్రాముల హారాన్ని మొదట స్వామివారి మూలమూర్తుల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ రమాదేవికి అందజేశారు.

రాజకీయ జోక్యమే కాపాడుతోందా?

- డీసీసీబీలో రూ.కోట్ల అక్రమాలపై విచారణకే పరిమితం
- నేడు మహాజన సభలో చర్చకు పట్టుబట్టే అవకాశం



ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) 127వ మహాజన సభ శుక్రవారం జరగనుండగా, బ్యాంకులో ఏళ్ల క్రితం అక్రమాలపై పలువురు చర్చకు పట్టుబట్టే అవకాశముందని తెలుస్తోంది. ఎనిమిదేళ్ల క్రితం ఖమ్మంలోని పలు బ్రాంచ్‌ల ద్వారా 21మంది ఇళ్ల నకిలీ ధ్రువపత్రాలతో రూ.6 కోట్ల రుణాలు తీసుకున్నారు. ఇవేకాక ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బ్రాంచ్‌ల ద్వారా రుణాల మంజూరీలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. వీటిపై నాలుగేళ్లుగా వివిధ స్థాయిల్లో విచారణ జరుగుతుండగా, కేవలం ఒక ఉద్యోగిని సస్పెండ్ చేశారు. మిగతా బ్రాంచ్‌ల అధికారులు అక్రమాలకు కారణమని తెలిసినా ప్రధాన కార్యాలయంలో ఒక ఉద్యోగిని సస్పెండ్ చేయడంతోనే సరిపెట్టడం గమనార్హం. మిగతా వారికి రాజకీయ నాయకుల అండ ఉండడంతో విచారణల పేరిట కాలం వెళ్లదీస్తున్నట్లు చర్చ జరుగుతోంది. కాగా, రూ.6కోట్ల రుణం తీసుకుని చెల్లించని వ్యవహారంపై గత పాలకవర్గం రాష్ట్ర సహకార బ్యాంకు(టస్కాబ్) దృష్టికి తీసుకెళ్లగా రాష్ట్ర సహకార శాఖ రిజిస్ట్రార్ విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీ విచారణ అనంతరం నివేదిక సమర్పించినా ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. ఈ వ్యవహారంపై కొద్దినెలల క్రితం జరిగిన సమావేశంలో డైరెక్టర్లు ప్రశ్నించారు. దీంతో శుక్రవారం జరిగే సమావేశంలో గట్టిగా నిలదీయాలని డైరెక్టర్లు భావిస్తుండడంతో, సభలో చర్చించేలా అజెండాగా చేర్చారు. అంతేకాక స్థానిక అధికారులతో విచారణ చేయించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ విషయమై బ్యాంకు సీఈఓ వెంకటఆదిత్యను సంప్రదించగా రుణ అక్రమాలపై మహాజన సభలో నిర్ణయం తీసుకునే అవకాశముందని, సభ్యులు చర్చిస్తే విచారణకు తీర్మానిస్తామని తెలిపారు. అలాగే, ఏడాది క్రితం బ్యాంకులో జరిగిన పలు అక్రమాలపైనా సభ్యులు నిలదీయనున్నట్లు సమాచారం. కాగా, వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో పంట రుణాలు, పీఏసీఎస్‌ల ద్వారా ఎరువుల పంపిణీపై చర్చించేలా అజెండాలో చేర్చారు.

పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి



వాహనాలను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ

బోనకల్: శాంతిభద్రతల పరిరక్షణకు పెట్రోలింగ్ ముమ్మరం చేయడమే కాక పాత నేరస్తుల కదలికలపై నిఘా వేయాలని అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు సూచించారు. బోనకల్ పోలీసుస్టేషన్‌ను గురువారం తనిఖీ చేసిన ఆయన స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, పెండింగ్ కేసుల విచారణపై ఆరాతీశారు. అనంతరం ప్రసాద్‌రావు మాట్లాడుతూ పోలీసులపై నమ్మకంతో స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అలాగే, ఇతర రాష్ట్రాల నుంచి విత్తనాలు, ఇతరత్రా అక్రమ రవాణా జరగకుండా నిరంతరం తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పొదిలి వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

మానవ తప్పిదమేనా!?

- పెరుగుతున్న 'ఆఫ్‌టైప్' ఆయిల్‌పామ్ బాధిత రైతులు
- గెలలు రాక ఏళ్ల శ్రమ వృథా అవుతోందని ఆవేదన
- రేగళ్లపాడు, దమ్మపేట నర్సరీల్లో ఇచ్చిన మొక్కలపైనే సందేహాలు



రేగళ్లపాడు నర్సరీలోని ఆయిల్‌పామ్ మొక్కలు

సత్తుపల్లి: ఆయిల్‌పామ్ తోటల్లో ఆఫ్‌టైప్ మొక్కల సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తోంది. తోటల్లో నానాటికీ ఆఫ్‌టైప్ మొక్కలు పెద్దసంఖ్యలో వెలుగు చూస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయిల్‌పామ్ సాగు పెంపే లక్ష్యంగా ప్రభుత్వం సబ్సిడీలు ఇస్తుంటే, కొన్ని నర్సరీల సిబ్బంది తప్పిదాలతో ఆఫ్‌టైప్ మొక్కల సరఫరా జరుగుతోందనే ఆరోపణల వెల్లువెత్తుతున్నాయి. అయితే, వీటిని తొలినాళ్లలో గుర్తించే అవకాశం లేక.. నాలుగేళ్ల తర్వాత మరుగుజ్జు గెలలు, కొన్నింటికి అసలు గెలలే రాకపోవడంతో ఏటా రూ.లక్ష చొప్పున నాలుగేళ్లకు రూ.4లక్షల పెట్టుబడి నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయిల్‌పామ్ సాగుతో మంచి దిగుబడి, లాభాలు వస్తాయని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతుండగా, ఇప్పుడు ఎదురైన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

చైర్మన్ పరిశీలించినా...

ఈ ఏడాది ఏప్రిల్ 24, 25వ తేదీల్లో ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో శాస్త్రవేత్తల బృందంతో కలిసి పర్యటించారు. పలుచోట్ల కాపురాని తోటలను పరిశీలించిన ఆయన రాష్ట్రంలోని 11 నర్సరీలకుగాను ఐదు నర్సరీల ద్వారా ఇస్తున్న మొక్కలతో సమస్య ఎదురవుతోందని తెలిపారు. ఆయా నర్సరీలను ప్రక్షాళన చేస్తే సగం సమస్యలు తీరతాయని చెప్పారు. ఇదే సమయాన కాపురాని తోటలకు పరిహారం ఇచ్చిన దాఖలాలు లేవని చెప్పిన ఆయన, ఉద్యోగుల్లో ఎవరైనా తప్పు చేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇది జరిగిన రెండు నెలలు దాటుతున్నా ఎవరిపైనా చర్యలు తీసుకున్న దాఖలాలే లేకపోవడం గమనార్హం.

రెండు వేల ఎకరాల్లో సమస్య

సుమారు రెండు వందల మంది రైతులు సాగు చేస్తున్న రెండు వేలకు పైగా ఎకరాల ఆయిల్‌పామ్ తోటల్లో ఆఫ్‌టైప్ మొక్కల సమస్య ఉందని తెలుస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట నర్సరీల ద్వారా లక్షలాది మొక్కలు నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాలకు అక్రమంగా రవాణా చేశారని చెబుతున్నారు. ఇదే సమయాన అశ్వారావుపేట మండలం దిబ్బగూడెంలోని తోటల్లో నాలుగేళ్ల క్రితం మొక్కలకు అంట్లు కట్టి నర్సరీల్లో పెంచి ఉమ్మడి జిల్లా రైతులకు ఇవ్వడంతోనే ఆఫ్‌టైప్ మొక్కలు వచ్చాయని రైతులు ఆరోపిస్తున్నారు. అలాగే, నారాయణపేట, గద్వాల జిల్లాల్లోనూ ఆఫ్‌టైమ్ సమస్య వెలుగు చూస్తున్నందున పూర్తిస్థాయిలో విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు బయటపడతాయని చెబుతున్నారు.

ఆ మొక్కల పంపిణీకి యత్నాలు

సత్తుపల్లి మండలం రేగళ్లపాడు నర్సరీలో తంబా రకానికి చెందిన 2.20 లక్షల మొక్కలను కల్లింగ్ చేస్తామని ప్రకటించినా, ఇప్పుడు రైతులకు అంటగట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని రైతు సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. ఐటీఆర్ సంస్థ ద్వారా విచారణ చేయిస్తే ఏవి నకిలీ, ఏవి అసలు మొక్కలో తేలుతాయని, ఇదే సమయాన తోటలను కూడా శాస్త్రవేత్తలతో పరిశీలన చేయించాలని కోరుతున్నారు. మరికొన్ని చోట్ల ఆయిల్‌పామ్ మొక్కల్లో జన్యులోపం వల్ల 30 – 40 కేజీలకు బదులు గెలలు 10 కేజీలు కూడా రావడం లేదని చెబుతున్నారు. ఈ విషయమై ఆయిల్‌ఫెడ్ అధికారులు, శాస్త్రవేత్తలు స్పందించి ఆయిల్‌పామ్ సాగు, నేలల రకాలపై రైతులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. కాగా, సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో ఆఫ్‌టైప్ మొక్కలు వచ్చిన తోటలను ఇటీవల రాష్ట్ర రైతు సంఘం నాయకులు పరిశీలించారు. నర్సరీల్లో మానవ తప్పిదాలతోనే వంధ్యత్వ మొక్కలు బయటకు వెళ్లాయని ఆరోపించిన వారు రైతులకు పరిహారంతో పాటు గెలలు టన్నుకు మద్దతు ధర రూ.25వేలు తగ్గకుండా చెల్లించాలని డిమాండ్‌తో ఆందోళనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

న్యూస్‌రీల్

నేడు, రేపు జాతీయ సదస్సు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ జూనియర్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యాన శుక్ర, శనివారాల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహమ్మద్ జకీరుల్లా తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి, తెలంగాణ సాహిత్య అకాడమీ తదితర విభాగాల ఆధ్వర్యాన శతజయంతి సాహితీమూర్తులు దాశరథి, ఆరుద్ర జీవితం, సాహిత్యంపై ఈ సదస్సు జరుగుతుందని వెల్లడించారు. కళాశాల విద్యా కమిషనర్ ఎ.శ్రీదేవసేనతో పాటు పలువురు కవులు, కళాకారులు హాజరవుతారని తెలిపారు.

సహాయ ఉపకరణాల దరఖాస్తు గడువు పొడిగింపు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వం దివ్యాంగులకు అందజేయనున్న సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 27వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. అర్హులైన దివ్యాంగులు https://tsobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆపై సంబంధిత పత్రాలను 27వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు కలెక్టరేట్‌లోని మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలనికాయన తెలిపారు.

నర్సింగ్‌లో నైపుణ్యాలతో మెరుగైన ఉపాధి



నర్సింగ్ విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

సత్తుపల్లి: నర్సింగ్ విద్యలో నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. సత్తుపల్లి మండలం కిష్టారంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆతర్వాత బేతుపల్లిలో జీలుగ సాగు, కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కోకో పంటలను పరిశీలించారు. అనంతరం రుద్రాక్షపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, యాతాలకుంటలో అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల పనులను పరిశీలించి, సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఎంపీడీఓ నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ, ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏఓ శ్రీనివాసరావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జోష్న, హౌసింగ్ ఏఈ పవన్ పాల్గొన్నారు.

బీఏఎస్‌కు నేడు విద్యార్థుల ఎంపిక

ఖమ్మంమయూరిసెంటర్: బెస్ట్ అవైలబుల్ స్కీం (బీఏఎస్) ద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను గురువారం లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్‌లోని డీపీఆర్‌సీ సమావేశ మందిరంలో ఉదయం 10గంటలకు 1వ తరగతి విద్యార్థులు(డే స్కాలర్), మధ్యాహ్నం 2గంటల నుంచి ఐదో తరగతి విద్యార్థుల(రెసిడెన్షియల్) ఎంపికలు ఉంటాయని వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరుకావాలని డీడీ సూచించారు.

అవగాహనతోనే సికిల్‌సెల్ నిర్మూలన



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కళావతి

కారేపల్లి: సికిల్‌సెల్ అనేది వారసత్వంగా వచ్చే రక్తరుగ్మత సమస్య అని.. ప్రజలందరూ అవగాహన పెంచుకోవడం ద్వారా ఈ వ్యాధి నిర్మూలన సాధ్యమవుతుందని డీఎంహెచ్‌ఓ కళావతి తెలిపారు. కారేపల్లి మండలం గోవింద్‌తండాలో గురువారంస్థానికులకు సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించాక ఆమె మాట్లాడారు. ధర్తి ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా సికిల్‌సెల్ పరీక్షల నిర్వహణతో పాటు అవగాహన కల్పిస్తూ పిల్లల్లో వ్యాధి నిర్మూలనకు పాటుపడుతున్నామని తెలిపారు. జన్యులోపాలతో ఎదురయ్యే ఈ వ్యాధి కారణంగా చిన్నారుల్లో గుండె, ఊపిరితిత్తుల సమస్యలు వస్తాయని చెప్పారు. జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ప్రత్యేక విభాగం ఏర్పాటుచేసినందున సద్వియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వీబీడీసీ ప్రోగ్రామ్ అధికారి వెంకటరమణ, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ రవీంద్ర ప్రసాద్, వైద్యాధికారి సురేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు మధిరలో జరిగే ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం 10–30 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం తిప్పనపల్లితో పాటు అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి మండలాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ మండలాల్లో జరిగే వివిధ కార్యక్రమాలకు మంత్రి హాజరవుతారు.

ప్రధాని పిలుపుతో ‘అమ్మ పేరుతో మొక్క’



మొక్క నాటుతున్న బీజేపీ అధ్యక్షుడు కోటేశ్వరరావు, నాయకులు

ఖమ్మం అర్బన్: పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ పిలుపుతో ‘అమ్మ పేరుతో మొక్క’కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. ఖమ్మం రోటరీనగర్‌లోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయం వద్ద పార్టీ నాయకుడు కుమిలి శ్రీనివాసరావు ఆధ్వర్యాన గురువారం మొక్కలు నాటగా కోటేశ్వరరావు మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక మోదీ పాలనలో ప్రజలు ధైర్యంగా జీవిస్తున్నారని, ఇదే సమయాన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, నాయకులు విజయరాజు, అల్లిక అంజయ్య, కంపసాటి అంజన్న, మేడిపల్లి నీలిమ, హుస్సేన్, సీతారాములు, ముత్యం, పల్లపు వెంకన్న, రమేష్, కృష్ణ, సత్యనారాయణ, రాజు, నరేందర్, సాంబశివరావు పాల్గొన్నారు.

భూభారతి సదస్సుల్లో దరఖాస్తుల వెల్లువ



దరఖాస్తులు తీసుకుంటున్న ఎస్‌డీసీ రాజేశ్వరి

ఎర్రుపాలెం: ఇటీవల అమల్లోకి వచ్చిన భూభారతి చట్టంపై గ్రామాల్లో నిర్వహిస్తున్న సదస్సులకు పెద్దసంఖ్యలో రైతులు హాజరై సమస్యలపై దరఖాస్తులు సమర్పిస్తున్నారని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి తెలిపారు. ఎర్రుపాలెం రైతు వేదికలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. సదస్సుల్లో అందిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని, తద్వారా రైతుల ఇక్కట్లు తీరనున్నాయని చెప్పారు. ఈకార్యక్రమంలో మధిర మార్కెట్ చైర్మన్ బండారు నరసింహారావు, తహసీల్దార్ ఎం.ఉషాశారద, ఉద్యోగులు శిరీష, రవికుమార్‌తో పాటు గుడేటి బాబురావు, షేక్ ఇస్మాయిల్, కంచర్ల వెంకటనరసయ్య, కడియం శ్రీనివాసరావు, మల్లెల లక్ష్మణ్‌రావు, షేక్ షాబాష్, బుర్రా వెంకటనారయణ, సూరంశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



చైర్మన్, ఉద్యోగులతో సీఈఓ వెంకటఆదిత్య

ముదిగొండ: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) అందే రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ సీఈఓ వెంకట ఆదిత్య సూచించారు. ముదిగొండలోని సొసైటీ కార్యాలయానికి గురువారం వచ్చిన ఆయన రుణాల మంజూరు, బకాయిలపై చర్చించారు. అనంతరం సీఈఓ మాట్లాడుతూ రైతులకు ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లతో పాటు గేదెల కొనుగోలుకు రుణాలు ఇవ్వాలని ఉద్యోగులకు సూచించారు. అనంతరం నూతనంగా నిర్మించిన సొసైటీ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. సొసైటీ చైర్మన్, వైస్‌చైర్మన్లు తుపాకుల యలగొండస్వామి, బట్టు పురుషోత్తం, సీఈఓ వెంకటరత్నం, డీజీఎం ఉదయశ్రీ, డీసీసీబీ బ్యాంక్ మేనేజర్లు మధులిక, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,100	1,800
పెసలు	7,500	4,300
కందులు	4,500	3,800
మినుములు	6,100	6,100
మిర్చి	12,900	6,000
ఏసీ మిర్చి	14,000	7,300
మిర్చి తాలు	7,000	6,000
పత్తి	7,100	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.18,748

అసైన్డ్ భూములు అన్యాక్రాంతం



అసైన్డ్ భూమిగా చెబుతున్న స్థలంలో నిర్మించిన భవనం కొలతలు వేస్తున్న ఉద్యోగులు

- అనుమతి లేని నిర్మాణాలకు అసెస్‌మెంట్ నంబర్లు
- ఫిర్యాదులతో నంబర్లు రద్దు చేసి చేతులు దులుపుకున్న కేఎంసీ అధికారులు
- విచారణకు రంగంలోకి దిగిన విజిలెన్స్



రెవెన్యూ ఉద్యోగులు, సర్వేయర్ సమక్షాన పంచనామా చేస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: అసైన్డ్ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలకు ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు అసెస్‌మెంట్ నంబర్లు కేటాయించడంపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. బల్లేపల్లి రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 137, 138ల్లోని అసైన్డ్ భూముల్లో చేపట్టిన నిర్మాణాలను గురువారం పరిశీలించి కొలతలు, ఎంత మేర నిర్మాణాలు చేపట్టారనే వివరాలు సేకరించారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్‌తో కూడిన బృందం అసైన్డ్ స్థలాల్లో పరిశీలించగా కేఎంసీ రెవెన్యూ విభాగం అధికారులు, టౌన్‌ప్లానింగ్ అధికారి, ఇతర సిబ్బంది పర్యవేక్షణలో వివరాలు సేకరించారు. అలాగే, రెవెన్యూ శాఖ ఖమ్మం అర్బన్ కార్యాలయ ఆర్‌ఐ, సర్వేయర్ పంచనామా చేశారు. అనంతరం జయనగర్ కాలనీ రోడ్డు నంబర్ 10లో ఓ భవనం, బాలపేటలోని ఇంకో భవనాన్ని కూడా పరిశీలించి కొలతలు తీసుకున్నట్లు తెలిసింది. అయితే, బాలపేటలోని భవన యజమానులు లేకపోవడంతో తిరిగి కేఎంసీ కార్యాలయానికిచేరుకొని అసెస్‌మెంట్ల రికార్డులు పరిశీలించినట్లు సమాచారం. 2021 నుంచి 2023 సెప్టెంబర్ వరకు రెవెన్యూ విభాగం నుంచి కేటాయించిన అసెస్‌మెంట్ల నంబర్లకు సంబంధించిన రికార్డులను తమకు అందజేయాలని కేఎంసీ అధికారులను విజిలెన్స్ అధికారులు కోరినట్లు సమాచారం.

రికార్డులు పరిశీలించకుండానే..

బల్లేపల్లి సర్వే నంబర్ 137, 138ల్లోని అసైన్డ్ భూములను ప్రభుత్వం కొందరు గిరిజనులకు కేటాయించి పట్టాలు అందజేసింది. ఆ భూమిలో వారు సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందాలే తప్ప నిర్మాణాలు చేపట్టడానికి వీలులేదు. అయితే, కొందరి నుంచి భూమి కొనుగోలు చేసిన ఓ వ్యక్తి అనుమతి లేకుండానే నిర్మాణం చేపట్టాడు. ఇదే మాదిరి ఇంకొందరు కూడా నిర్మాణాలు చేశారని సమాచారం. అయితే, అసైన్డ్ భూమిలో నిర్మాణాలను కేఎంసీ అధికారులు అడ్డుకోకపోగా.. రెవెన్యూ విభాగం నుంచి అసెస్‌మెంట్ నంబర్లు కేటాయించడం గమనార్హం. తద్వారా ఆ నంబర్ ఆధారంగా సదరు వ్యక్తి భూమి తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రత్యేక విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా కనెక్షన్ తీసుకున్నాడు. ఇదంతా కళ్ల ముందే జరుగుతున్నా ఏ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించకపోగా అనుమతులపై ఆరా తీయకపోవడం గమనార్హం. ఈనేపథ్యాన అసైన్డ్ స్థలంలో నిర్మాణాలు, అసెస్‌మెంట్ నంబర్లు కేటాయింపు అందిన ఫిర్యాదులతో విజిలెన్స్ అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ ప్రారంభించారు.

ఆ నంబర్లు రద్దు

అసైన్డ్ స్థలాల్లో చేపట్టిన నిర్మాణాలకు అసెస్‌మెంట్ నంబర్లు కేటాయించడం, వీటి రిజిస్ట్రేషన్లు జరగడంపై ఆరోపణలు రావడంతో కేఎంసీ అధికారులు నంబర్లను రద్దు చేశారు. కానీ అనుమతి లేని నిర్మాణాలు, నిర్మాణదారులపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అసైన్డ్ భూముల్లో చేపట్టిన నిర్మాణాలకు ఇంటి నంబర్లు ఎలా ఇచ్చారనే ప్రశ్న ఉత్పన్నమవుతుండగా, ఈ విషయంలో కేఎంసీ టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగ అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నాటి రికార్డుల పరిశీలన

ఖమ్మం నగర పాలకసంస్థ పరిధిలో అనుమతి లేకుండా చేపట్టిన వందలాది నిర్మాణాలకు రెవెన్యూ విభాగ అధికారులు అక్రమంగా అసెస్‌మెంట్(ఇంటి నంబర్లు) కేటాయించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై అందిన ఫిర్యాదులతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. కేవలం బల్లేపల్లి ప్రాంత నిర్మాణాలే కాక అసెస్‌మెంట్ నంబర్ల కేటాయింపుపై పూర్తిస్థాయి విచారణకు ఉపక్రమించినట్లు సమాచారం. ఇందులో భాగంగా 2021 ఏడాది నుంచి 2023 సెప్టెంబర్ వరకు అసెస్మెంట్ల నంబర్ల కేటాయింపు రికార్డుల పరిశీలనకు సిద్ధమైనట్లు తెలిసింది. ఆతర్వాత క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.

మంత్రి పదవులు ఇవ్వకుంటే గుణపాఠం చెబుతాం



సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: యాదవులు, మున్నూరు కాపులతో పాటు ఎంబీసీలకు మంత్రి పదవులు ఇవ్వకుంటే కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతామని తెలంగాణ రాష్ట్ర బీసీ జనసభ అధ్యక్షుడు డి.రాజారాంయాదవ్ హెచ్చరించారు. ఖమ్మంలో గురువారం ‘బీసీల రిజర్వేషన్లు, మంత్రి పదవుల కేటాయింపు’అంశంపై తెలంగాణ యాదవ మహాసభ జిల్లా కార్యదర్శి గుమ్మా రోశయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి యాదవులు, మున్నూరుకాపులు, ఎంబీసీలు సహకరించగా, యూపీఏ–1, 2 ప్రభుత్వం మనుగడలోనూ ములాయంసింగ్ యాదవ్, లాలూప్రసాద్ యాదవ్ కృషి ఉందని తెలిపారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి యాదవజాతిని నిర్లక్ష్యంగాచూడడం సరికాదన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సూచనల మేరకు ఇకనైనా మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై 30వ తేదీన యాదవ సంఘాల జేఏసీ ఆధ్వర్యాన హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రాజారాం కోరారు. సదస్సులో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మున్నూరు కాపు సంఘం నాయకుడు గుండాల కృష్ణ, గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి అమరగాని వెంకన్నగౌడ్, తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు కోడి లింగయ్య యాదవ్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు ఎర్రబోయిన గోవిందరావు, గోవర్ధన్, మేకల కృష్ణ, మధు, బారీ మల్సూర్, చిత్తారు ఇందుమతి, జడ మల్లేష్, జంగా సత్యనారాయణ, మీగడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు



సన్న బియ్యంతో భోజనం చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళల అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు తెలిపారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం మహిళలను చిన్నచూపు చూస్తే, నేటి ప్రభుత్వం మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా తోడ్పాటునిస్తోందని తెలిపారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడుతూ మహిళల పేరిట అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. అనంతరం రాహుల్‌గాంధీ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేయడంతో పాటు జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. అలాగే, ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యకర్త గుంటి భవాని ఇంట్లో సన్న బియ్యంతో భోజనం చేశారు. నాయకులు దుంపా రూప, జాను, కుమారి, తోట దేవీప్రసన్న, దామా స్వరూప, బిక్కసాని స్వరూప, దేవత్ దివ్య, కొత్తపల్లి పుష్ప, ఊరుకొండ చంద్రిక, అన్నపూర్ణ, కె.సుగుణ, సుగుణ, ప్రతిభారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి పకడ్బందీగా పోటీలు



కంప్యూటర్ బోధనను పరిశీలిస్తున్న సీఎంఓ రాజశేఖర్

నేలకొండపల్లి: ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి మండలాల వారీగా ఎంపిక పోటీలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని విద్యాశాఖ సీఎంఓ, ఫిట్ ఇండియా జిల్లా నోడల్ అధికారి రాజశేఖర్ తెలిపారు. నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం పాఠశాలలను గురువారం తనిఖీ చేసిన ఆయన కంప్యూటర్ ఆధారిత బోధనపై ఆరా తీశారు. అలాగే, విద్యార్థుల ప్రగతి, సామర్థ్యాలను పరీక్షించాక దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సీఎంఓ మాట్లాడుతూ రాజేశ్వరపురం భవిత కేంద్రాన్ని నేలకొండపల్లిలోని దివ్యాంగుల పునరావాస కేంద్రంలో విలీనం చేసినట్లు తెలిపారు. ఇక్కడ ఫిజియోథెరపీ ద్వారా వారిని తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. కాగా, స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి ఈనెల 21 వరకు మండలస్థాయి పోటీలు పూర్తిచేసి, 22న ఖమ్మంలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తామని, అక్కడ ప్రతిభ చాటిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. కాగా, అన్ని వసతులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక విధానాలతో లాభసాటిగా సాగు



రైతులకు సూచనలు చేస్తున్న డీఏఓ పుల్లయ్య

చింతకాని: పంటల సాగులో రైతులు ఆధునిక పద్ధతులు అవలంభిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. చింతకాని మండలం జగన్నాధపురం, పందిళ్లపల్లి, గాంధీనగర్ కాలనీల్లో పత్తి పంటను గురువారం ఆయన పరిశీలించారు. పత్తి విత్తనాలను జూలై 15వరకు విత్తుకునే అవకాశమున్నందున, భూమిలో తగిన తేమ వచ్చాకే నాటాలని సూచించారు. తొలుత విత్తన శుద్ధి చేయడం ద్వారా తెగుళ్లను కొంతమేర తగ్గుతాయని తెలిపారు. ఆతర్వాత ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, తెగుళ్ల నియంత్రణపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ మానస, ఏఈఓలు రాము, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



డీఈఓను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

సత్తుపల్లిటౌన్/పెనుబల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక పద్ధతుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి సామినేని సత్యనారాయణ తెలిపారు. సత్తుపల్లి మండలం సిద్ధారం యూపీఎస్‌లో ఏఐ బోధన, సత్తుపల్లి పాత యూపీఎస్‌లో పీఎంశ్రీ అమలును గురువారం పరిశీలించిన ఆయన జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు బిగ్‌హెల్ప్ సంస్థ సమకూర్చిన బ్యాగ్‌లు పంపిణీ చేసి మొక్కలు నాటారు. అలాగే, గత ఏడాది పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించడంపై జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శైలకుమారి, ఉపాధ్యాయులను డీఈఓ అభినందించారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలాగే, పెనుబల్లి మండలం వీఎం బంజర్, కుప్పెనకుంట్ల జెడ్పీహెచ్‌ఎస్‌ల్లో బడిబాట ముగింపు సందర్భంగా నిర్వహించిన స్పోర్ట్స్ డేలో డీఈఓ పాల్గొన్నారు. వెనుకబడిన విద్యార్థులను విద్యాసంవత్సరం మొదట్లోనే గుర్తించి వారి సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ ఎస్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి



గోరీబీ(ఫైల్)

కొణిజర్ల: పత్తి చేనులో పని కోసం నడిచి వెళ్తున్న ఓ మహిళను ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో చికిత్స కోసం తరలిస్తుండగా మృతి చెందిన సంఘటన మండలంలోని తీగలబంజరలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ జి.సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం.. తీగలబంజరకు చెందిన సయ్యద్ గోరీబీ(53) పత్తి చేనులో పనికి వెళ్తుండగా సింగరాయపాలెంకు చెందిన ఎస్.సాయికృష్ణ ద్విచక్ర వాహనంతో వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కింద పడిన గోరీబీ మామూలుగానే లేచి ఇంట్లోకి వెళ్లింది. ఆ కాసేపటికి వాంతులు చేసుకుంటుండడంతో వైరా ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. గోరీబీకి భర్త జానీమియా, ఇద్దరు కుమార్తెలు ఉండగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సూరజ్ తెలిపారు.

బాలుడి గొంతులో ప్లాస్టిక్ గన్ బుల్లెట్

- ఏడాదిగా నొప్పి, మింగలేక ఇబ్బందులు
- శస్త్రచికిత్స ద్వారా బయటకు తీసిన వైద్యుడు





బాలుడు, ఆయన తల్లిదండ్రులతో డాక్టర్ ప్రవీణ్ (ఇన్‌సెట్) బయటకు తీసిన ప్లాస్టిక్ బుల్లెట్

ఖమ్మంవైద్యవిభాగం: ఆడుకునే క్రమాన ప్లాస్టిక్ గన్ బుల్లెట్‌ను నోట్లో పెట్టుకోగా అది బాలుడి గొంతులో ఇరుక్కుపోయింది. దీంతో ఏడాది కాలంగా నొప్పి, ఏదీ సరిగా తినలేక ఇబ్బంది పడుతుండగా శస్త్రచికిత్స ద్వారా బయటకు తీసినవైనమిది. మహబూబాబాద్ జిల్లా పాతపోచారం గ్రామానికి చెందిన పి.శ్రవణ్‌కుమార్ – సౌజన్య దంపతుల మూడేళ్ల కుమారుడు షణ్ముక్ కొంత కాలంగా గొంతు నొప్పి, మింగలేకపోవడం, తినలేక బాధపడుతున్నాడు. చాలా ఆస్పత్రులకు వెళ్లినా ఫలితం లేక ఖమ్మం నెహ్రూనగర్‌లోని ప్రవీణ్ ఈఎన్‌టీ ఆస్పత్రిలో డాక్టర్ ఎం.జీ.వీ.ప్రవీణ్‌ను సంప్రదించారు. బాలుడికి ఎండోస్కోపీ నిర్వహించినా ఫలితం లేక సిటీ స్కాన్ చేయగా గొంతు వెనుక భాగంలో వస్తువు కనిపించింది. అత్యంత సున్నితమైన మెదడు అడుగు భాగాన పదునైన వస్తువు ఉన్నట్లు తేలడంతో శస్త్రచికిత్స ద్వారా బయటకు తీయగాఅది ప్లాస్టిక్ గన్ బుల్లెట్‌గా గుర్తించారు. దీన్ని అలానే వదిలేసి ఉంటే కపాలం నుంచి మెదడులోకి చొచ్చుకెళ్లి మెదడుకు రక్తం సరఫరా చేసే రక్తనాళాలను పాడు చేసేదని వైద్యుడు వివరించారు.

తల్లి మృతి, కుమారుడికి గాయాలు



సావిత్రి (ఫైల్)

పెనుబల్లి: ఆగి ఉన్న బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఓ మహిళ మృతి చెందగా ఆమె కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. బోనకల్ మండలం గార్లపాడుకు చెందిన గుడికందుల కోటేశ్వరరావు సత్తుపల్లిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆయన గురువారం తన తల్లి సావిత్రి(60)ని తీసుకుని బైక్‌పై సత్తుపల్లి వెళ్తుండగా మార్గమధ్యలో పెనుబల్లి మండల టేకులపల్లి వద్ద లగేజీ సరిచేసేందుకు జాతీయ రహదారి పక్కన ఆగాడు. ఈక్రమంలో సత్తుపల్లి వైపు వెళ్తున్న లారీ వీరిని ఢీకొట్టగా తీవ్రగాయాలతో సావిత్రి అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే, కోటేశ్వరరావుకు సైతం గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

అత్యాచారం కేసులో గ్రానైట్ వ్యాపారి అరెస్ట్

ఖమ్మంక్రైం: మహిళపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఓ గ్రానైట్ వ్యాపారిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు తెలిపారు. ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలో నివసించే ఓ కుటుంబంతో కలిసి అదే ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు గ్రానైట్ వ్యాపారం చేస్తున్నాడు. తరచుగా వారి ఇంటికి వెళ్లే వెంకటేశ్వర్లు ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళను బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు.

గ్రామాల్లోనూ కంటైనర్ గృహాలు!

- ఖర్చు తక్కువ.. అన్ని వసతులు
- నచ్చిన కొలతల్లో తయారీకి అవకాశం



చింతల సతీష్, ఇంటి యజమాని



కొణిజర్లలో ఏర్పాటు చేసిన క్యాబినెట్ ఇల్లు



అటాచ్డ్ బాత్‌రూమ్‌తో బెడ్ రూమ్

కొణిజర్ల: ఇప్పటి వరకు నగరాలు, పట్టణాల్లో దుకాణాలు, చిన్నపాటి ఆఫీసులుగా చూసిన కంటైనర్ ఇళ్లు ఇప్పుడు అందరికీ చేరువవుతున్నాయి. ఇష్టం వచ్చిన రీతిలో త్వరగా సమకూర్చుకునే అవకాశం ఉన్నందున గ్రామాల్లోనూ పలువురు వీటిని ఆర్డర్‌పై తయారు చేయించుకుంటున్నారు.

దూలపల్లిలో తయారీ..

కొణిజర్ల వాసి చింతల సతీష్‌కు ఇక్కడ 300 చదరపు అడుగుల స్థలం ఉంది. ఈ స్థలంలో బేస్‌మెంట్ నిర్మించాక ప్రీ ఫ్యాబ్రికేట్ ఇళ్లు సిద్ధం చేసి ఇస్తున్నారని తెలియడంతో హైదరాబాద్ కొంపల్లి సమీపాన దూలపల్లిలోని సంస్థను సంప్రదించాడు. దీంతో కిచెన్, హాల్, సింగిల్ బెడ్ రూమ్ అటాచ్డ్ బాత్ రూమ్‌తో కంటైనర్ రూపంలోని ఇళ్లు తయారుచేసి ఇచ్చారు. ప్రత్యేక వాహనంపై తీసుకొచ్చి ముందే నిర్మించిన బేస్‌మెంట్‌పై ఫిట్ చేయించాడు. తనకు ఉన్న స్థలం కొలతల ఆధారంగా ఇంటిని సిద్ధం చేయించుకున్న సతీష్ ఇందుకోసం రూ.6 లక్షల వ్యయమైందని, జీఎస్‌టీ, రవాణా కలిపి మరో రూ.లక్ష వెచ్చించానని చెబుతున్నారు. ఇంటీరియర్ డిజైన్‌తో పాటు వాటర్, హీట్, ఫైర్ ప్రూఫ్‌గా ఉండి ఏడాది వారంటీతో ఇచ్చారని వెల్లడించాడు. కాగా, ఈ ఇంటిని స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. సింగిల్ బెడ్‌రూమ్, డబుల్ బెడ్‌రూమ్‌తో పాటు నచ్చిన కొలతలతో ఇంటి నిర్మాణానికి అవకాశం ఉండడంతో పలువురు సంస్థను సంప్రదించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే, ఈ ఇళ్లలో కాస్తంత ఎత్తు తక్కువగా ఉండడం కొంత లోపంగా చెబుతున్నారు. సాధారణంగా ఇళ్లు పది అడుగుల ఎత్తులో నిర్మిస్తుంటే ఈ క్యాబినెట్ ఇల్లు మాత్రం తొమ్మిది అడుగుల ఎత్తులోనే ఉంది.